


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

## ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

శుక్రవారం 08 ఆగస్టు 2025 పేజీలు 06


### పశువులకు వ్యాధులు రాకుండా

# చర్యలు తీసుకోండి

## - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

పశువులకు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం లక్ష్మణచందా మండలం కనకాపూర్ గ్రామంలో నిర్వహించిన పశువుల టీకాలు



వేసే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా పశువైద్యులతో కలెక్టర్ మాట్లాడి బ్లూ టంగ్ వ్యాధి నివారణకు ఇచ్చే టీకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్‌కు సంబంధించిన రిజిస్టర్లు, నమోదు వివరాలను తనిఖీ చేశారు. వర్షాకాలంలో వ్యాధులు విస్తరించే ప్రమాదం ఎక్కువగా ఉండడంతో, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల్లో అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యులను సంప్రదించాలని రైతులకు సూచించారు. టీకాల కార్యక్రమాలను సమయానికి పూర్తి చేయాలని, పశు రైతులు తమ పశువులకు విధిగా టీకాలు వేయించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అంబాజీ, ఎంపిడిఓ రాధా రాథోడ్, పశువైద్య అధికారి శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

---

## అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు

### - జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్

**ఆసిఫాబాద్ ప్రతినిధి,ఆగస్టు 7, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదికలో ఆసిఫాబాద్ మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో అర్హులైన వారికి రేషన్ కార్డు మంజూరి పత్రాలు పంపిణీ కొరకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనకు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించడం జరుగుతుందని, అర్హత కలిగి రేషన్ కార్డు రానివారు మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించినట్లయితే విచారణ జరిపి అర్హులైన వారికి రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రేషన్ కార్డు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలకు ప్రామాణికమని, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ, రేషన్ బియ్యం వంటి పథకాలు వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం, మున్సిపల్ పరిధిలో 1 వేయి 152 నూతన రేషన్ కార్డులు, 1 వేయి 848 మంది కుటుంబ సభ్యులను రేషన్ కార్డులలో చేర్చడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా అందిస్తున్న సన్నబియాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రియాజ్ అలీ, ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు అలీబిన్ అహ్మద్, సహాయ పౌరసరఫరాల అధికారి సాదిక్, నాయక్ తహసిల్దార్ పోచయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**



జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని దండేపల్లి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించి రోగులతో ఆసుపత్రిలో అందిస్తున్న సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు మందుల నిల్వలను అందుబాటులో ఉంచి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. కర్ణపేట గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ( మిగితా...2లో )



---

### నూతన రేషన్ కార్డులను అందజేసిన

# కలెక్టర్, ఎమ్మెల్యేలు

**మావల, సూర్య మేజర్ న్యూస్**

అదిలాబాద్ రూరల్,అర్బన్, మావల, తలమడుగు,తాంసి మండలాల



లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డుల పత్రాలను అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదిలాబాద్ శాసన సభ్యులు పాయల్ శంకర్,బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్.రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురువారం అదిలాబాద్ రూరల్, అర్బన్, మావల మండలాల లబ్ధిదారులకు రెవెన్యు గార్డెన్ లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, శాసన సభ్యులు పాయల్ శంకర్‌లు రేషన్ కార్డుల పత్రాలను అందజేశారు.తలమడుగు మండలం సుంకిడి రైతు వేధిక ఆవరణలో వన మహెూత్సవం సందర్భంగా ఈత మొక్కలు నాటి, అనంతరం రైతు వేధికలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు రేషన్ కార్డుల పత్రాలను అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా, బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్.ఈ సందర్భంగా అదిలాబాద్ రెవెన్యు గార్డెన్ లో మావల, అదిలాబాద్ రూరల్, అర్బన్ మొత్తం దరఖాస్తులు 8359 రాగా అప్రూవల్ అయినవి 6677, రిజెక్టెడ్ 399,ఎమ్మారో పెండింగ్ 1283, డి ఏఎస్ ఒ పెండింగ్ 229 ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శాసన సభ్యులు




మాట్లాడుతూ రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం అని, ఇంకా రేషన్ కార్డులు రాని అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలనీ ఆన్నారు.రేషన్ కార్డు పై ఇచ్చే సన్న బియ్యం ఇంట్లో వాడుకోవాలని, బయట ఎవరికి అమ్మకూడదని,ఒకవేళ అమ్మినట్లు తెలిస్తే రేషన్ కార్డు రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆన్నారు.

### విద్యార్థుల పఠన సామర్థ్యాలను

# పెంపొందించాలి

## - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి



2లో

---

### ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని

# ఘనంగా నిర్వహించాలి

## - ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా



**ఆసిఫాబాద్ ప్రతినిధి,ఆగస్టు 07, సూర్య మేజర్ న్యూస్ :**

ఈ నెల 9వ తేదీన ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ( మిగితా...2 లో)

సూర్య
www.suryaa.com
శుక్రవారం 08 ఆగస్టు 2025

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మొదటి పేజీ తరువాయి...**

విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని, ఉపాధ్యాయులు విధుల పట్ల సమయపాలన పాటించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి చారించాలని తెలిపారు. లింగాపూర్ గ్రామంలోని ఆదర్శ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో అందిస్తున్న ఆహారం నాణ్యత, సదుపాయాల వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, గుణాత్మక విద్యను అందించాలని తెలిపారు. గ్రామంలో పర్యటించి పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను పరిశీలించారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు



శుభ్రపరచాలని, ప్రతి రోజు ఇంటింటి నుండి తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి ఇంటికి శుద్ధమైన, త్రాగునీటిని అందించాలని తెలిపారు. గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వనమహోత్సవం కార్యక్రమం కొరకు అవసరమైన మొక్కలను సిద్ధం చేయాలని, సకాలంలో మొక్కలకు నీటిని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ధర్మారావుపేట గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకోవాలని, బిల్లులు త్వరగా మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నిరుపేదల కొరకు ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్దిదారులు సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. ద్వారక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి అధికారులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పసిపిల్లలకు తల్లిపాలు శ్రేష్ఠం

## - పంచాయతీ కార్యదర్శి ప్రమీల

**ఉట్నూర్ సూర్య మేజర్ న్యూస్ :** తల్లి పాలు పసి పిల్లలకు శ్రేష్ఠమని , ప్రసవం అయిన వెంటనే పిల్లలకు ముర్రుపాలు తాగించాలని శంకర్ గూడ పంచాయతీ



కార్యదర్శి ప్రమీల అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని ఇంద్రవెల్లి మండలం శంకర్ గూడ గ్రామంలో తల్లిపాల ఆవశ్యకత, ప్రయోజనాలపై సి డి టి ఓ మాస ఉమాదేవి, సూపర్ వైజర్ రేవతి, అంగన్వాడి టీచర్ కుసి వర్తలతో కలిసి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పసిపిల్లలకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని, తల్లిపాల కారణంగా పిల్లలలో రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని, 6 నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని తెలిపారు. పిల్లల ఆరోగ్యం పై తల్లి పాల ప్రభావం అధికంగా ఉంటుందని, పాలు ఎక్కువగా ఉత్పత్తి కావాలంటే ప్రత్యేకమైన పౌష్టికాహారం తీసుకోవాలని, పిల్లలకు పాలు పట్టే విధానాలపై వివరించారు. చిన్నపిల్లల ఆరోగ్యం విషయంలో తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇండ్లు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు ఆహారం ఇచ్చే సమయంలో శుభ్రత పాటించాలని తెలిపారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులు ప్రతిరోజు అంగన్వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సింధుబాయి, భూలక్ష్మి, ఆశా కార్యకర్త గాయబాయి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

## రేపు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలి..తుడుం దెబ్బ నాయకులు

**సిరికొండ,ఆగస్టు 07,సూర్య మేజర్ న్యూస్ :** రేపు జరగబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు అన్నారు గురువారం సిరికొండ మండల కేంద్రంలోని కుమరం భీం చౌక్ వద్ద వారు మాట్లాడుతూ రేపు జరగబోయే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల తో పాటు వివిధ గ్రామాలలో జెండా ఎగురవేసి మండల కేంద్రంలోని కుమరం భీం చౌక్ వద్ద అధిక సంఖ్యలో ఆదివాసీలు రావాలని అన్నారు వివిధ గ్రామాల పటేల్ లు దేవరిలు మహజన్లు సార్మేడిలు వివిధ సంఘాల నాయకులు ప్రజాప్రతినిధులు అధికారులు సర్పంచులు ఉపసర్పంచ్లు ఎంపిటిసిలు ఆదివాసీ విద్యార్థి సంఘం యువకులు మహిళలు యువతులు రైతులు తరలి వచ్చి ఘనంగా జరుపుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో మండల తుడుం దెబ్బ అధ్యక్షుడు కుమరం యాదవ్ రావ్,కుమరం భీం ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు కోట్నక్ పాండు, రీమ్మ సార్మేడి అమృత్ రావ్, మాజీ జెడ్పీటీసీ కుమరం రఘురాం, మాజీ సర్పంచ్ పెందుర్ అనిల్ కుమార్,ఆదివాసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు పెందుర్ మహేంద్ర, సిడం నాగోరావ్,మాహదు, తదితరులు పాల్గొన్నారు.



### ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని

# ఘనంగా నిర్వహించాలి

## - ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా

**మొదటి పేజీ తరువాయి...**

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవిలతో కలిసి ఆదివాసి సంఘాల నాయకులు, అధికారులతో ఈ నెల 9వ తేదీన జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్ లో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు 9 తెగల నాయకులు సహకరించాలని, కార్యక్రమానికి హాజరయ్యే వారికి భోజన వసతులు కల్పించడం జరుగుతుందని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆదివాసి సంస్కృతిని ప్రపంచానికి తెలియపరచాలని అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఆ దిశగా సంబంధిత శాఖల అధికారులు, ఆదివాసీ సంఘాల నాయకులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు వేడుకలకు హాజరయ్యే ప్రజలను, సాంస్కృతిక బృందాలను తీసుకురావడంలో వాహన ఖర్చులను సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ భరించాలని కోరారు. అనంతరం ఆదివాసి దినోత్సవం సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్ గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షులు మడావి శ్రీనివాస్, నాయకులు సిడాం అర్జు, కుడ్మెత మారుతి, మడావి నర్సింగ్ రావు, పెందూర్ సుధాకర్, ఆత్రం భీమ్రావు, ఆత్రం సంతోష్, మర్సుకోల సరస్వతి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### టేకు చెట్లను నరికిన వ్యక్తిని

# బైండోవర్ చేసిన అధికారులు

**జన్నారం, ఆగస్ట్ 07, సూర్య మేజర్ న్యూస్ :**

జన్నారం రేంజ్ పరిధిలో గల చింతగూడ సెక్షన్ పైడిపల్లి బీట్ లో ఇటీవల దొంగ చాటుగా విలువైన టేకు చెట్లను నరికి తరలించిన చింతగూడకు చెందిన కండ్లే కమలాకర్ ను తమ సిబ్బంది అదుపులోకి తీసుకొని గురువారం ఎమ్మార్వో రాజ మనోహర్ రెడ్డి ముందు బైండోవర్ చేసినట్లు జన్నారం ఇన్చార్జి రేంజ్ ఆఫీసర్ సుష్మారావు తెలిపారు. చెట్లను నరికిన వారిలో బొమ్మనకు చెందిన మైనేని సురేష్, మైనేని తిరుపతి, అలాగే చింతగూడకు చెందిన కండ్లే




కమలాకర్, దేగ మహేష్, ఎండి తహర్ పాషా లుండగా కండ్లే కమలాకర్ ను అదుపులోకి తీసుకోగా మిగతా నలుగురు పరారీలో ఉన్నట్లు సుష్మారావు తెలిపారు. వారిని సైతం త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ఎమ్మార్వో ముందు కండ్లే కమలాకర్ ను హాజరు పరిచిన వారిలో సెక్షన్ ఆఫీసర్ జాడి శివకుమార్, బీట్ ఆఫీసర్ లాల్బాయ్, కానిస్టేబుల్ చంద్రమౌళి ఉన్నట్లు సుష్మారావు తెలిపారు.

# విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంపొందించాలి

## - జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి

**వాంకిడి,ఆగస్టు 07, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లాలోని వాంకిడి మండలం ఇందాని గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత



పాఠశాలను సందర్శించి వంటశాల, ఆహారం నాణ్యత, హాజరు పట్టికలు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలను కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచి విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంపొందించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఉల్లాస్ జిల్లా స్థాయి శిక్షణకు ముఖ్య అతిథిగా హాజరైన

# జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**

ఉల్లాస్ జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం వయోజన విద్య నవభారత్ సాక్షరత కార్యక్రమం గురువారం స్థానిక డైట్ కళాశాలలో ఏర్పాటు చేసిన డి ఆర్ డి ఒ, మెప్మ సిబ్బందికి జిల్లా రిసోర్స్ పర్సన్‌లకు నిర్వహించిన శిక్షణకు



ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణా మన్యువల్, అక్షర వికాసం, మార్గదర్శి కరదీపిక బుక్స్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ సేర్ఫ్ , డి ఆర్ డి ఒ, సీసీ, మెప్మా ఆధ్వర్యం లో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 32821 మంది చదువురాని , వయోజన విద్యకు అర్హులైన వారిని గుర్తించడం జరిగిందనీ, 25,996 మందిని ఉల్లాస్ యాప్ లో రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తెలిపారు. అలాగే వయోజన విద్య ద్వారా చదువు నేర్పించేందుకు వాలంటీర్లు 1192 మందిని ఉల్లాస్ యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందనీ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం 26, 312 కు చేరువలో ఉన్నామని త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఓపెన్ స్కూల్ లో 1698 టార్గెట్ కాగా లక్ష్యాలను అధిగమించి 2753 ఐడెంటిఫై చేయడం జరిగిందని, 625 మంది వెబ్సైట్ లో రిజిస్టర్డ్ చేసుకున్నారని, అడ్మిషన్లు చివరి తేది ఈ నెల ఆగస్ట్ 18 వరకు అని పేర్కొన్నారు. వయోజనులకు విద్యను అందించే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ (ఉల్లాస్ %-% అండర్స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ అల్ ఇన్ సొసైటీ) కార్యక్రమం కింద, జిల్లా స్థాయిలో శిక్షణా కార్యక్రమాన్ని డైట్ కళాశాలఈ శిక్షణ పై ఉల్లాస్ నూతన కార్యక్రమాల ద్వారా వయోజనులలో చదువుపట్ల ఆసక్తిని పెంపొందించడమే కాక, దేశ అభివృద్ధికి దోహదపడే పౌరులను తయారుచేయవచ్చు" అని పేర్కొన్నారు. జిల్లాలో అక్షరాస్యత శాతం 66 ఉందని వంద శాతం పూర్తి చేయుటకు కృషి చేయాలనీ, మహిళల్లో అక్షరాస్యత పెంచుటకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా డి ఆర్ పి లు అవగాహన కల్పించుకొని మండల వీటీసీ లకు అవగాహన కల్పించి వారు తమ ప్రాంతాల్లో ఉల్లాస్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఒ రవిందర్, మున్సిపల్ కమిషనర్ సీవీయన్ రాజు, ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ అశోక్, డీఈఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి

**నస్పూర్, ఆగస్టు 7, సూర్య మేజర్ న్యూస్:**

స్కూల్ బస్సులకు ఫిట్నెస్ ఇన్సూరెన్స్ తప్పనిసరి అని, డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ కచ్చితంగా ఉండాలని నస్పూర్ ఎస్సై ఉపేందర్ రావు అన్నారు.



నస్పూర్ లోని ఆక్సిఫోర్డ్ స్కూల్లో ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎస్సై ఉపేందర్ రావు మాట్లాడుతూ, ప్రైవేటు స్కూలు బస్సు డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్ పై, అవగాహన కలిగి ఉండాలని, డ్రైవర్లకు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, అన్నారు. స్కూల్ బస్సులకు ఇన్సూరెన్స్, ఫిట్నెస్, పొల్యూషన్, సర్టిఫికెట్ కలిగి ఉండాలని అన్నారు. బస్సులో సామర్థ్యం మేరకే పిల్లలను ఎక్కించుకోవాలని, మద్యం తాగి బస్సు నడప రాదని అన్నారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్ కు సన్మానం

**మంచిర్యాల టౌన్, ఆగష్టు 8,సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన మనోజ్ ని మర్యాద పూర్వకంగా



కలిసి పుష్పగుచ్చంతో ఘనంగా సన్మానించారు. సబ్ కలెక్టర్ టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరితో మాట్లాడుతూ, టీఎన్జీవోలోని ప్రతి ఒక్క ఉద్యోగి మంచిగా పని చేస్తూ అటు ప్రభుత్వము, ఇటు ప్రజల దృష్టిలో మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. తెలంగాణ అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి బాధ్యత ఉందని తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్, బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్, సభ్యులు సరిత, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభం

**లక్షెట్టిపేట, ఆగష్టు 07, సూర్య మేజర్ న్యూస్ :**

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగేళ్ల సమీకృత (ఇంటిగ్రేటెడ్) బి.ఏ. బి. ఎడ్ . కోర్సులో ప్రవేశాల కొసం స్పాట్ అడ్మిషన్ చేబడుతున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డా సంతోష్ మహాత్మా గురువారం ఒక ప్రకటనలో తెలుపారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష ఎన్ టి ఏ 2025 హాజరై ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఎవరైనా 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ డిగ్రీ కళాశాల లక్షెట్టిపేట లో బి.ఏ. బి. ఎడ్ ప్రవేశం కోసం ఆగస్ట్ 8వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట లోపు కళాశాల వెబ్ సైట్ లో పెట్టిన గూగుల్ ఫామ్ ద్వార దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి అదే రోజు సాయంత్రం ఎంపికైన విద్యార్థుల జాబితా కాలేజీ వెబ్ సైట్ లో ప్రకటించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 97032 67391 ఫోన్ నెంబర్ లో ప్రిన్సిపాల్ ని మరియు ఐ.టి.ఏ.పి. కో ఆర్డినేటర్ 99128 52567 ఫోన్ నెంబర్ లో సంప్రదించగలరని ప్రిన్సిపాల్ సూచించారు.

### పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

## ఆరోగ్య రక్షాబంధన్ కార్యక్రమం

**భైంసా రూరల్,ఆగస్ట్ 07,సూర్య మేజర్ న్యూస్**

భైంసా మండలం చుచుంద్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఉచితంగా బ్లడ్ గ్రూపింగ్, హిమోగ్లోబిన్,బిఎంఐ పరీక్షలను నిర్వహించడం జరిగింది. అంతేకాకుండా "ఆరోగ్య రక్షాబంధన్" పేరుతో గురుకృపా కళాశాల విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు ముందస్తుగా రాఖీలు కట్టి పండగ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, గురుకృప ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్,అధ్యాపకులు మధు,పాఠశాల ఉపాధ్యాయులు జి.రాజేశ్వర్,గణపతి,శ్రీనివాస్,గంగాధర్,గజ్జరం,గౌతమ్, రజిత రాణి,ముత్తన్న,విద్యార్థులు ఉన్నారు.

## స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ఇంటింటికి బిజెపి కార్యక్రమం

**సారంగాపూర్,ఆగస్టు 8,సూర్య మేజర్ న్యూస్**

స్థానిక ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ఇంటింటికి బిజెపి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బిజెపి మండల అధ్యక్షుడు కాల్వ నరేష్ అన్నారు. మండలంలోని కంకేట, వైకుంఠాపూర్, తాంద్ర (జి), ప్యారామూర్ గ్రామాలలో బిజెపి మహా సంపార్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వివరించినట్లు ఆయన తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే బిజెపితోనే సాధ్యమని,గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే అభివృద్ధి జరుగుతుందని, గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఏమి



చేయడం లేదని అయన అన్నారు. స్థానిక ఎన్నికలలో ఒక్క సీటు కూడా కాంగ్రెస్ గెలవదని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఒకరికి వివరించి స్థానిక ఎన్నికలలో విజయం సాధించేందుకు దోహదం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి, గంగారెడ్డి, సాహెబ్ రావ్, చెన్న రాజేశ్వర్, శ్రావణ్ కుమార్, రాథోడ్ నారాయణ,పోతన్న, భోజన్న, విలాస్, నర్సయ్య, ఏల్లన్న, శ్రీకాంత్, నారాయణ, వెంకటేష్, తిరుమల చారి, శ్రీకాంత్ రెడ్డి, దయాకర్, రాజారెడ్డి, మధుకర్ రెడ్డి, మధు మోహన్ రెడ్డి, వినోద్, గద్దర్, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## బాసర్ ట్రిపుల్ ఐటి లో స్పోర్ట్స్ కోటా యందు సీటు సాదించిన మస్కాపూర్ పాఠశాల విద్యార్థి

**ఖానాపూర్ టౌన్ ఆగస్టు 7 సూర్య మేజర్ న్యూస్**

స్థానిక మస్కాపూర్ పాఠశాల విద్యార్థి ముద్ర కోళ్ల శివ సాయి, జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు ట్రిపుల్ ఐటీ బాసరలో స్పోర్ట్స్ కోటా యందు సీటు సాదించడం జరిగింది. గత సంవత్సరం జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో స్వర్ణ పథకం సాధించాడు. ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో కూడా తెలంగాణ రాష్ట్రం తరఫునుంచి పాల్గొన్నాడు. తాను సాదించిన సర్టిఫికెట్ల ఆధారంగా ట్రిపుల్ ఐటీ బాసర్ కి



ఎంపికయ్యాడు. పాఠశాల తరఫునుంచి ట్రిపుల్ ఐటీ బాసర కి స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన మొదటి విద్యార్థిగా నిల్చాడని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొనగిరి నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా సీటు సాధించిన విద్యార్థి శివ సాయిని, ఆయన తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ ఇమ్రాన్, ఉపాధ్యాయులు అంజయ్య, శేఖర్, శంకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు చిరు కానుకలందించిన పోలీసు

**కాగజ్నగర్, ఆగస్టు 7 , సూర్య మేజర్ న్యూస్:**

కాగజ్నగర్ డివిజన్లో పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ విశిష్ట సేవలందిస్తున్న మధు తన తండ్రి క్రీ.శే. వేముర్ల శంకరయ్య 11 వ వర్ధంతి



సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం కాగజ్నగర్ మండలంలోని గొల్లగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బూట్లు.సాక్స్ లు.టైలు, బెల్ట్ లు. గురువారం నాడు పంపిణి చేశారు . ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం పర్శ చంద్రశేఖర్ , గొల్లగూడ పాఠశాల హెచ్ఎం కె. జయేందర్ , స్వాతి మరియు విద్యార్తు లు, వారి తల్లిదండ్రులు, ఉపసర్పంచ్ మొండి, డీలర్ పుల్లయ్య,ఏఎస్ఎం రాజ్యలక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా ఎన్నికైన

## రాందాస్ కు సన్మానం

**ఆసిఫాబాద్ ప్రతినిధి, సూర్య మేజర్ న్యూస్:**

కొమురం భీం జిల్లా ఆసిఫాబాద్ నియోజకవర్గం ఎలక్ట్రానిక్ మీడియా నూతనంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షునిగా చునార్కర్ రాందాస్ ఎన్నికయ్యారు. వారిని ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్యాం నాయక్



శాలువతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల పాత్ర సమాజంలో చాలా కీలకమని అన్నారు. అంతేకాకుండా జర్నలిస్టులో సమాజ మార్గదర్శకులనీ అన్నారు. అనంతరం రాందాస్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రాజు, సభ్యులు వెంకటేష్, శ్రీనివాస్, శ్రీకాంత్,మీనేష్,రాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటిఐ లో రెండవ విడత ప్రవేశాలు

**శ్రీరాంపూర్ ఆగష్టు 07 సూర్యా మేజర్ న్యూస్**

2025 2026 విద్యా సంవత్సరంకు గాను ప్రభుత్వ ఐటిఐ శ్రీరాంపూర్ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటిసి) ప్రవేశానికి గాను మొదటి విడతలో మిగిలిన కాలేజీ సీట్లను భర్తీ చేయుటకు గాను రెండవ విడత నోటిఫికేషన్ కమిషనర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ జారీ చేసినారు. రెండవ విడుత వాక్ ఇన్ అడ్మిషన్స్ కి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా ఆన్లైన్ అప్లికేషన్ ప్రింటింగ్ కాపీ తో పాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో భౌతికంగా గౌట్ ఐటిఐ శ్రీరాంపూర్ కి వాట్ ఇన్ అడ్మిషన్ కు హాజరు కాగలరు. మీ వాక్ ఇన్ అడ్మిషన్ తేదీ 06, ఆగష్టు 20 25 నుండి 28, ఆగష్టు 2025 వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి ప్రారంభించబడును. ఎవరికైతే ఇంకా ఆన్లైన్లో అప్లై చేసుకోని వారు కూడా వాక్ ఇన్ అడ్మిషన్కి హాజరు కావచ్చు.

### శ్రీరాంపూర్ ప్రభుత్వ ఐటిఐ లో

కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ 43 సీట్లు,మెకానికల్ డీజిల్ 20 సీట్లు, డ్రాఫ్ మెన్ సివిల్ 20 సీట్లు.

### అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ట్రేడ్లు

సి ఎన్ సి మేషనింగ్ టెక్నీషియన్ 24 సీట్లు,,ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ 20 సీట్లు,ఇండస్ట్రియల్ రోబోటిక్స్అండ్,డిజిటల్మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ 40 సీట్లు,మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్ 40 సీట్లు,మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ 24 సీట్లు వర్చువేల్ అనాలిసిస్ అండ్ డిజైనర్ ఎం 24 సీట్లు ప్రభుత్వ ఐటిఐ శ్రీరాంపూర్, మంచిర్యాల్ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

### అన్నదాన కార్యక్రమంకు

## నేటి తో 135 వారాలు

**భీమిని, సూర్య మేజర్ న్యూస్:**

భీమిని మండల కేంద్రంలో ప్రతి గురువారం వార సంతలో శ్రీరామ సేవా సమితి మరియు భీమిని మాజీ ఎంపీపీ శ్రీమతి, పోతురాజుల రాజేశ్వరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం ఈ రోజుతో 135వ వారానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో శ్రీ రామ సేవా సమితి అధ్యక్షులు పోతురాజుల లక్ష్మణ్, సతీష్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.



# నిర్లక్ష్యం చేస్తే.. సస్పెన్షన్




- ఇక బయోమెట్రిక్
- ఎస్ఆర్ఎస్ ద్వారా హాజరు
- గ్రామ కార్యాలయాల్లో బయోమెట్రిక్ తప్పనిసరి
- జియో కోఆర్డినేట్ ఆధారంగా లాగిన్, లాగౌట్
- సర్కార్ స్కూల్ టీచర్లకు ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానం
- డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ద్వారా సమగ్ర పర్యవేక్షణ



**లక్షెట్టిపేట,ఆగష్టు07,సూర్య మేజర్ న్యూస్**

### ప్రత్యేక కథనం :

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల్లో నిర్లక్ష్య విధులు, హాజరులో అనుచితంగా ప్రవర్తిస్తున్న ఉద్యోగులపై గట్టి చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త అడుగులు వేసింది. ముఖ్యంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులపై పర్యవేక్షణ పెంచేందుకు బయోమెట్రిక్ హాజరు, ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్ యాప్ (ఎస్ఆర్ఎస్) ను తెచ్చింది.

### గ్రామ కార్యదర్శులకు బయోమెట్రిక్:

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోని గ్రామ కార్యదర్శులపై వచ్చిన నిర్లక్ష్య ఆరోపణల నేపథ్యంలో, మంత్రి సీతక్క ఆదేశాల మేరకు త్వరలో అన్ని గ్రామ పంచాయతీలో బయోమెట్రిక్ మిషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఎంపీవోలు, డీపీవోల పర్యవేక్షణలో మార్పులు రావాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయడం ద్వారా విధుల్లో నిర్లక్ష్యానికి చెక్ పెట్టే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్ వంటి కఠిన చర్యలూ తీసుకోనున్నారు.

### ఉపాధ్యాయులకు ఎస్ఆర్ఎస్

ఇక ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు హాజరులో పారదర్శకత తీసుకురావడానికి రాష్ట్రప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ ఆధారిత హాజరు విధానాన్ని (ఎస్ఆర్ఎస్) ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఈ విధానం విద్యార్థులకు అమలవుతుండగా, ఆగస్టు మొదటి వారం నుంచి టీచర్లకూ పూర్తిస్థాయిలో అమలుకానుంది. ఇది మొదట ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రారంభమై, వారం రోజుల్లో అన్ని సర్కార్ బడుల్లో అమలవుతుంది.

### జియో కో ఆర్డినేటెడ్ లాగిన్, లాగౌట్ విధానం

ఈ విధానంలో టీచర్లు ఉదయం పాఠశాలకి వచ్చినప్పుడు, సాయంత్రం తిరిగి వెళ్తున్నప్పుడు స్కూల్ ఆవరణలో నుంచే మొబైల్ ద్వారా ముఖాన్ని స్కాన్ చేసి హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. స్కూల్ ప్రాంగణం నుంచే జియో కోఆర్డినేట్ ఆధారంగా లాగిన్, లాగౌట్ చేయడం తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది.

### డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా పరిపాలన

ఈ వ్యవస్థను డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా నడుపుతున్నారు. యాప్ ద్వారా ఎన్ని విద్యార్థులు హాజరయ్యారు, మధ్యాహ్న భోజన నిర్వహణ ఎలా జరిగింది అనే వివరాలు నేరుగా ప్రభుత్వానికి చేరేలా వ్యవస్థను రూపొందించారు. తాజాగా ఈ యాప్ లో స్టాఫ్ సెక్షన్ చేర్చడం ద్వారా టీచర్ల హాజరు వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నారు.

### పారదర్శకతే లక్ష్యం

ఈ చర్యల ద్వారా ఉద్యోగుల నిర్లక్ష్యానికి తావులేకుండా చూడడమే కాక, ప్రభుత్వ విధుల్లో పారదర్శకత, నిష్పక్షపాతత, విధేయతకు పెద్దపీట వేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. ఉద్యోగులు తమ బాధ్యతలను సమర్ధంగా నిర్వర్తించేందుకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ చర్యలు దోహదపడతాయని అధికారులు పేర్కొంటున్నారు.

## డీజిల్ లేక గ్రామాల్లో నడవని చెత్త సేకరించే ట్రాకర్

**ఖానాపూర్ సూర్య మేజర్ :** ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాలలో పరిశుధ్యం అడుగున పడుతుంది. గ్రామాల్లో ఇళ్ల నుండి సేకరించే గ్రామ పంచాయతీ ట్రాక్టర్లు సరిగా నడవక చెత్త ఇళ్లలోనే ఉండిపోయి, దోమలు తయారు అయి, ప్రజలు పలు రోగాల బారిన పడుతున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ విషయమై సూర్య దిన పత్రిక మండలంలోని పాత ఎల్లాపూర్ పంచాయతీ కార్యదర్శి ని సంప్రదించగా , ఆ కార్యదర్శి డీజిల్ ట్రాక్టర్ లో పోయించాలన్న కూడా మా దగ్గర పైసలు లేవు, మాకే సరిగా జీతాలు వస్తలేవు కావున పంచాయతీ ట్రాక్టర్ నడపడం కష్టసాధ్యమని వివరణ ఇచ్చుడు. అనంతర ఎంపీఓ రత్నాకర్ కి తెలుపగా సమస్య పరిష్కరిస్తామని అన్నారు. ఈ విషయమై ఉన్నతాదికరులు , ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి గ్రామాలలో చెత్త సేకరణ ట్రాకర్ లు చెత్త సేకరించేలా చూడాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



## పుట్టిన బిడ్డకు ముర్రుపాలు తాగించాలి - ఐసిడిఎస్ పిడి రవూఫ్ ఖాన్

**జన్నారం, ఆగస్ట్ 07, సూర్య మేజర్ న్యూస్ :** అప్పుడే పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగించాలని ఐ సి డి ఎస్ పి డి రవూఫ్ ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని కిష్టాపూర్, పొనకల్, చింతగూడ గ్రామాలలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. చింతగూడ, పొనకల్ లో జరిగిన కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి రవూఫ్ ఖాన్ పాల్గొని మాట్లాడుతూ తల్లి శిశువుకు పాలివ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్ వంటి ప్రాణాంతకమైన వ్యాధులు దరిచేరవన్నారు. తల్లులు చనుపాలు ఇవ్వడం వల్ల కాన్పు తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గడంతో పాటు త్వరగా కోలుకుంటారని అన్నారు. ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి పెరగడమే కాకుండా శిశువుకు సమతుల్యమైన పోషకాహారం అందుతుందన్నారు. తల్లిపాలలో పుష్కలమైన ప్రోటీన్లు, విటమిన్లు ఉండటం తో శిశువు రక్తహీనత బారిన పడకుండా కాపాడుకోవచ్చు అన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు రవూఫ్ ఖాన్ విద్యాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమాలలో సూపర్వైజర్లు దీపావాహిని, పద్మ, కవిత, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.




# లొల్లికి సై అంటే సై...

- పాలనాధికారి ముందే పథకాల లొల్లి...
- 10 సంవత్సరాల తర్వాత నూతన రేషన్ కార్డు సన్న బియ్యంతో అందిస్తున్నాం కాంగ్రెస్ పార్టీ నాయకులు. - తులం బంగారం ఎక్కడ అంటూ నిలదీసిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు - ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం కార్యకర్తల తోపులాట, పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గందరగోళం






**తలమడుగు ఆగస్టు 7 సూర్య మేజర్ న్యూస్:**

రేషన్ కార్డ్ నిరంతర ప్రక్రియని ఎవరు ఆందోళన చెందద్దని అందరికీ లబ్ది చేకూరేలా కృషి చేస్తామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో తలమడుగు మరియు తాంసి తాసిల్దారుల అధ్యక్షతన నిర్వహించిన వన మహోత్సవం, నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజార్షి షా, స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్, డిసిసిబి చైర్మన్ అడ్డి బోజారెడ్డి లు హాజరై ముందుగా గౌడన్నలతో కలిసి అధికారులు ప్రజాప్రతినిధులు ఈత మొక్కలు నాటి వాటికి నీళ్లు అందించినారు. అనంతరం రైతు వేదికలో రెండు మండలాల నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓ నాయకుడు మాట్లాడుతూ ప్రభుత్వం అనేకమైన సంక్షేమ పథకాలతో పాటు పది సంవత్సరాల తరువాత ప్రజలకు రేషన్ కార్డుల పండగ ఈరోజు జరుగుతుందని స్టేజి మీద ఉన్న అధికారులు ప్రజాప్రతినిధులతో పాటు పేద ప్రజలు కూడా సన్నబియ్యాన్ని తినాలని ఉద్దేశంతో ఈ ప్రభుత్వం మంచి నాణ్యత గల సన్నబియ్యాన్ని ప్రజలకు అందిస్తుందని అనడంతో పక్కన ఉన్న బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తులం బంగారం మరికొన్ని పథకాలు ఎటు వెళ్లాయని విమర్శించడంతో డిసిసిబి చైర్మన్ అడ్డి బోజారెడ్డి ప్రభుత్వ కార్యక్రమాలకు వచ్చి కావాలని లొల్లి చేయడం సరికాదన్నారు. కొన్ని రోజుల ముందు కూడా ఇలానే బిఆర్ఎస్ నాయకులు లొల్లి చేయడం జరిగిందని మాటలు జాగ్రత్తగా రావాలని మండిపడుతూ పోలీసులు రావాలని కోరిన వెంటనే కాంగ్రెస్ బిఆర్ఎస్ ఇరు పార్టీల నాయకుల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది, పోలీసుల జోక్యంతో గందరగోళం సద్దుమణిగింది. భోజ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేకమైన సంక్షేమ పథకాలు గ్యారెంటీలు ఒక్కొక్కటిగా చేస్తూ పోతుందని ఇకముందు కూడా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల వైపు నిలబడుతుందని అన్నారు. జిల్లా కేంద్రం నుంచి అయితే ఆదివాసి గూడాల వరకు ఈరోజు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల మంజూరు, మహిళకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత కరెంటు, వేలాది సంఖ్యలో ఉద్యోగాలు కల్పించామని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా చీటికి మాటికి లొల్లి చేయడానికి చూస్తే బాగోదని హెచ్చరించారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ మనకు లొల్లి చేయడం అవసరం లేదని ప్రభుత్వ కార్యక్రమాలు జరిగేటప్పుడు ఇతర పార్టీల పేర్లు గాని పథకాల పేర్లు గాని తీసుకురావద్దని అన్నారు. గతంలో మా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేకమైన సంక్షేమ పథకాలు తీసుకువచ్చి,పేద ప్రజల అభివృద్ధికై కృషిచేసి రాష్ట్ర ప్రజల గుండెల్లో ఉన్నామని అన్నారు. డిసిసిబి చైర్మన్ మొన్నటి వరకు ఏ పార్టీలో ఉన్నారో ఇప్పుడు ఏ పార్టీలో ఉండి ఏం మాట్లాడుతున్నారో అర్థం చేసుకోవాలని లొల్లి చేసే అంత అవసరం లేదని ప్రజాప్రతినిధులుగా ప్రజలకు కావలసిన అవసరాలను తీర్చాలని అన్నారు. కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన సన్నబియ్యాన్ని ప్రజలకు అందిస్తుందని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రేషన్ కార్డులు చేయిస్తామని ఎవరైనా అధికారులు, ప్రజాప్రతినిధులు డబ్బులు అడుగుతే అడిగిన వారిని ఇచ్చిన వారిపై ఇద్దరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు ప్రజాప్రతినిధులు ప్రజల బాగోగుల కోసం వారి బాధలను తీర్చడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం రెండు మండలాల లబ్ధిదారులందరికీ నూతన రేషన్ కార్డుల మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, తలమడుగు తహసిల్దార్ రాజ్ మోహన్, తాంసి తాసిల్దార్ లక్ష్మి, డిప్యూటీ తాసిల్దార్ లు ప్రభాకర్, గణేష్ యాదవ్, ఆర్ ఐ రోహిదాస్, జూనియర్ అసిస్టెంట్స్ రాఘవేంద్ర, సాయిరాం అధికారులు ప్రజా ప్రతినిధులు ఆయా పార్టీల నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ సంక్షేమ పథకాలను పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి**

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఇందిరమ్మ ఇండ్లు, పారిశుధ్యం, త్రాగునీరు, విద్యార్థుల హాజరు శాతం పెంపుదల, పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, వన మహోత్సవం, ఉపాధి హామీ పథకంలో పనుల కల్పన, పంచాయితీ అడ్వాన్స్ మెంట్ ఇండెక్స్, పంచాయితీ కార్యదర్శుల హాజరు, స్థానిక సంస్థల ఓటరు జాబితా రూపకల్పన అంశాలపై జూన్ మీటింగ్ ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, మండల విద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు, పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి, గృహ నిర్మాణ, మున్సిపాలిటీ, విద్యా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు 100 పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, వన మహోత్సవం కార్యక్రమంలో జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ప్రతి ఇంటికి సిద్ధమైన త్రాగునీటిని అందించాలని, పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థుల హాజరు 100 శాతం ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి కూలీలకు పని కల్పించాలని, పంచాయితీ అడ్వాన్స్మెంట్ ఇండెక్స్ లో పంచాయితీలోని పూర్తి వివరాలు నమోదు చేయాలని, పంచాయతీ కార్యదర్శుల హాజరుపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కొరకు ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు తదితరులు పాల్గొన్నారు.




# నకిలీ బిల్లుల వ్యవహారంలో ఏఈ సస్పెండ్

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**ముధోల్,ఆగస్టు07,సూర్య మేజర్ న్యూస్ :**

ముధోల్ మండలంలోని ఎడ్ బిడ్ పీఆర్ పనుల్లో నకిలీ బిల్లుల వ్యవహారం వెలుగులోకి రావడంతో అక్కడి అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) సురేందర్‌ను సస్పెండ్ చేసినట్టు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఈ వ్యవహారం తమ దృష్టికి వచ్చాక తదుపరి విచారణకు ఆదేశించినట్లు కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నకిలీ బిల్లుల వ్యవహారం నిజమేనని తేలినందున ఆయన్ను సస్పెండ్ చేయడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు చట్టవిరుద్ధంగా వ్యవహరించకూడదని, భవిష్యత్‌లో ఇటువంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఉద్యోగులందరూ క్రమశిక్షణతో,నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.



## జిల్లాకు చేరుకున్న బ్యాలెట్ బాక్సుల టీం

**-జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు**

**మంచిర్యాల ,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు గుజరాత్ రాష్ట్రంలోని జాంనగర్ కలెక్టర్, ద్వారక జిల్లా (దేవభూమి) కంబలియా డిప్యూటీ కలెక్టర్ లను కలిసి ఆయా జిల్లాల నుండి బ్యాలెట్ బాక్సులను సేకరించుకుని బృంద సభ్యులు గురువారం జిల్లాకు చేరుకున్నారని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు 970 బ్యాలెట్ బాక్సులతో దాదాపు 3 వేల 200 కిలోమీటర్లు ప్రయాణించి పోలీసు బందోబస్తుతో బ్యాలెట్ బాక్సులను తీసుకుని వచ్చిన మండల పంచాయతీ అధికారులు అజ్మత్ అలీ, శ్రీపతి బాపు రావు, పంచాయతీ కార్యదర్శి సుమన్, డి పి ఎం నరేందర్, పోలీస్ సిబ్బందిని అభినందించారు. బ్యాలెట్ బాక్స్ లను నస్పూర్ లో గల సి.ఐ.ఎస్.ఎఫ్. క్వాటర్లలో భద్రపరచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి షేక్ సర్దార్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఎద్దు మృతి

**కడెం సూర్య మేజర్ న్యూస్ :** కడెం మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన గంట లచ్చన్న అనే రైతుకు చెందిన ఎద్దు గ్రామ సమీపంలో మేత కోసం వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌కు తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు 70 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు లచ్చన్న కోరాడు.

## ప్రజ్ఞ స్కూల్ లో ముందస్తు రాఖీ సంబరాలు

**కడెం సూర్య మేజర్ న్యూస్ :** కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో గల ప్రజ్ఞ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ముందస్తుగా రాఖీ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టి సోదర,సోదరీమణుల మానవ సంబంధాలను,మైత్రీబంధాన్ని గుర్తుచేశారు. ఈ వేడుకలు స్కూల్ కరస్పాండెంట్ రంజిత్ గౌడ్ ఆధ్వర్యంలో ఎంతో ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఖీ పండుగ భారతీయ సంస్కృతిలో అత్యంత విశిష్టమైనది అని అన్నారు. ఇది సోదర,సోదరీమణుల మధ్య ప్రేమ,రక్షణ,భద్రత అనే విలువలను బోధిస్తుందిఅని,మన సంస్కృతి గొప్పతనాన్ని అర్థం చేసుకొని, అందులోని సారాన్ని అనుసరించాలి అని తెలిపారు. ఇందులో స్కూల్ టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## మంచిర్యాలను అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య**

**మంచిర్యాల బ్యూరో,సూర్య మేజర్ న్యూస్ :**

మంచిర్యాల జిల్లాను నిరక్షరాస్యులు లేని అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య అన్నారు. నవభారత సాక్షరత కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, విద్యాశాఖ అదనపు సంచాలకులు శ్రీనివాస చారి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ప్రత్యేకంగా 3 అంశాలతో ఉంటుందని, మొదటిది 15 సంవత్సరాలు దాటిన నిరక్షరాస్యులకు విద్యను అందించడం, రెండవది 10వ తరగతి, ఇంటర్ అనుత్తీర్ణులైన వారిని ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయడం, మూడవది సమాజంలో ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమాలలో పాల్గొని సమాజంలో ఉన్న నిరక్షరాస్యతను నిర్మూలించవలసిన అవసరం ఉందని, ప్రతి మండలం నుండి ఇద్దరు రిసోర్స్ పర్సన్లు మండల కేంద్రంలో జరిగే శిక్షణలో పాల్గొని గ్రామస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. 1971 నుండి వయోజన విద్యా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ఇందులో భాగంగా జిల్లాలోని 31 వేల 435 మంది నిరక్షరాస్యులను గుర్తించి వాలంటీర్ల ద్వారా చదువు చెప్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రు నాయక్, కమ్యూనిటీ మొబైల్ అధికారి చౌదరి, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేత

**నస్పూర్,ఆగస్టు07,సూర్య మేజర్ న్యూస్ :**

విశ్వహిందూ పరిషత్ సేవా విభాగం ఆధ్వర్యంలో మంచిర్యాలలోని నస్పూర్‌లో ఉచిత శిక్షణకేంద్రంలోని శిక్షార్థులకు గురువారం సర్టిఫికెట్లు అంద చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల సత్యం పాల్గొని మార్గ సందేశం చేశారు. అనంతరం శిక్షార్థులకు ధృవపత్రాలు అంద చేశారు. ఆయన మాట్లాడుతూ హిందువుల్లో చైతన్యం రావాలని హిందువు లందరూ మేల్కొవాలని అన్నారు. హిందువుల ఐక్యతే దేశానికి రక్ష అన్నారు. మహిళలు ఉపాధిక సంబందించి తమ సొంత కాళ్లపై నిలబడేందుకు మా యొక్క సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాంత సేవా ప్రముఖ్ రాజేందర్ రెడ్డి ,మాతృశక్తి ప్రాంత సహసంయోజిక శ్రీవాణి విభాగ్ కార్యదర్శి అయోధ్య రవి, జిల్లా అధ్యక్షులు రేవల్లి రాజలింగు, జిల్లా కార్యదర్శి వేముల రమేష్, శిక్షకురాలు కనకతార ,జిల్లా సహకార దర్శి సంతోష్ ,జిల్లా కోశాధికారి బైరి విష్ణు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.





## టిఎన్ఎంవిఎస్ మంచిర్యాల జిల్లా ఇంచార్జిగా దుర్గం భాను ప్రసాద్

**బెల్లంపల్లి, ఆగస్టు 07, సూర్య మేజర్ న్యూస్:**

సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ వేదికగా తెలంగాణ నేతకాని మహార్ రాష్ట్ర అధ్యక్షులు సాయిని ప్రసాద్ నేత ఆధ్వర్యంలో నిర్వహించిన నేతకాని విద్యార్థుల రాష్ట్రస్థాయి సమావేశంలో బెల్లంపల్లి మండలం చిన్నాబుద గ్రామానికి చెందిన దుర్గం భాను ప్రసాద్ మంచిర్యాల జిల్లా ఇన్చార్జిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం దుర్గం భాను ప్రసాద్ మాట్లాడుతూ నేతకాని సమాజ అభివృద్ధి కోసం విద్యార్థుల శ్రేయస్సు కోసం ఒక క్రమశిక్షణ కలిగిన విద్యార్థి సంఘంలో పని చేస్తూ గతంలో బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులుగా, నియోజకవర్గ అధ్యక్షుడిగా తనకు అందించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ప్రస్తుతం జిల్లా ఇంచార్జిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సమాజంపట్ల తన బాధ్యత మరింత పెరిగిందని భానుప్రసాద్ గురువారం ప్రకటనలో తెలియజేశారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్ నేతకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనకు నియామక పత్రం అందించిన పెద్దలకు సహకరించిన విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే జిల్లాస్థాయి నేతకాని విద్యార్థుల సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు దానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆహ్వానించారు.



